## క్లుప్తంగా

### జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలకు చర్యలు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీఎల్‌డీవో మంజులావాణి

మునగపాక : జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని డీఎల్‌డీవో మంజులావాణి అన్నారు. హౌసింగ్ డేలో భాగంగా నాగులాపల్లి జగనన్న కాలనీని ఆమె శనివారం సందర్శించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పట్టాతో పాటు ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే సాయం అందజేస్తున్నామని, లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని అన్నారు. ఎంపీడీవో రవికుమార్, ఈవోఆర్డీ ఈశ్వరరావు, ఇన్‌ఛార్జి తహసీల్దార్ వినయ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### గ్రంథాలయంలో 'చదవడం మా కిష్టం'



అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో పుస్తకాలను చదువుతున్న విద్యార్థులు

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో శనివారం వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా చదవడం మా కిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు వివిధ రకాల పోటీ పరీక్షల పుస్తకాలను చదివారు. రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించిన నరేంద్ర మాట్లాడుతూ విద్య, ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

### రేపు కలెక్టరేట్ వద్ద ధర్నా



మాట్లాడుతున్న సీఐటీయూ నేత బ్రహ్మాజీ

మునగపాక : ఈ నెల 29న అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.బ్రహ్మాజీ కోరారు. మునగపాకలోని ఉపాధి హామీ పథకం కూలీలతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం దశలవారీగా మంగళం పాడేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా చేపట్టనున్న ధర్నాకు పెద్దసంఖ్యలో కూలీలు హాజరుకావాలన్నారు.

### ఆసక్తిని కలిగిస్తున్న విజ్ఞాన శిబిరాలు



కోటవురట్ల శాఖా గ్రంథాలయంలో కథ చెబుతున్న విద్యార్థిని

కోటవురట్ల : వేసవి విజ్ఞాన శిబిరాలను మంచి స్పందన వస్తోంది. విద్యార్థులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకుని ఉత్సాహంగా పోటీలలో పాల్గొంటున్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులతో పుస్తక పఠనం చేయించి, కథలు చెప్పడంపై సాధన చేయించారు. గ్రంథాలయాధికారి అప్పలనాయుడు, ఉపాధ్యాయుడు మస్తాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

### పోషకాహారం సక్రమంగా అందించాలి

మునగపాక : అంగన్‌వాడీ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పి.రవికుమార్ కోరారు. మండలంలోని నాగులాపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన శనివారం సందర్శించారు. కేంద్రంలోని పిల్లల హాజరు పరిశీలించి వారికి అందించే ఆహారాన్ని రుచి చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలతో పాటు బాలింతలు, గర్భిణులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలన్నారు. ఆయన వెంట ఈవోఆర్డీ ఈశ్వరరావు ఉన్నారు.



# అన్ని రంగాల్లో రాష్ట్రాభివృద్ధే జగనన్న ధ్యేయం



ఎడ్లబండి తోలుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట : రాష్ట్రం అన్ని రంగాల్లోను అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని అందుకోసమే అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మండలంలో గల సత్యవరం గ్రామంలో 4 వ రోజు గడప గడపకు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి 4 ఏళ్లు పూర్తయిందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 98 శాతం పూర్తి చేయడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అమలుపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం సంక్షేమ పథకాలతో కూడిన బ్రోచర్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఎడ్ల బండిని తోలారు. హుషారుగా గ్రామంలో పర్యటించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, గ్రామ సర్పంచ్ సకిలేటి రాము, ఎంపీటీసీలు తమ్మిర్సి సత్యనారాయణ, యగదాసు శేఖర్, కొంతం నరేష్, పార్టీ సీనియర్ నాయకులు గూటూరు వెంకటేశ్వరరావు, జగతా శ్రీను, పెనుమత్స నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ తమ్మిర్సి గంగారావు, కేశనకుర్తి సత్తిబాబు పాల్గొన్నారు.

**104 వైద్య శిబిరం సందర్శన**

పాయకరావుపేట : సత్యవరం గ్రామంలో వైద్య సేవలను ఎమ్మెల్యే గొల్ల బాబూరావు శనివారం పరిశీలించారు. మంగవరం పీహెచ్‌సీ వైద్యాధికారి మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సత్యవరం గ్రామంలో 104 వైద్య సేవలను గ్రామస్తులకు శనివారం అందించారు. గ్రామంలో గడప గడపకు కార్యక్రమం నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే గొల్ల బాబూరావు వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను వైద్యాధికారి మురళీకృష్ణారెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

# డాక్టర్ మురళీకృష్ణ సేవలు మరువలేనివి



డాక్టర్ మురళీకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి అమర్‌నాథ్,గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్



మురళీకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మునగపాకకు మునగపాక గ్రామ నివాసి డాక్టర్ మళ్ల మురళీకృష్ణకు శనివారం పలువురు రాజకీయ పార్టీ నేతలు, గ్రామస్తులు ఘనంగా నివాళులర్పించారు. ఈనెల 13న అచ్యుతాపురం మండల పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో డాక్టర్ మురళీకృష్ణ మృత్యువాతకు గురైన విషయం తెలిసిందే. ఈ మేరకు శనివారం మునగపాకలో సంతాప సభ నిర్వహించారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు మురళీకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. మురళీకృష్ణ తండ్రి సంజీవరావుకు ధైర్యం చెప్పి ఓదార్చారు. వైద్యపరంగా మంచి సేవలందించే తరుణంలో రోడ్డు ప్రమాదానికి గురై మురళీకృష్ణ మృతి చెందడం బాధాకరమన్నారు. కరోనా సమయంలో మురళీకృష్ణ అందించిన సేవలను మరువలేమన్నారు. గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, కశింకోట జెడ్పీటీసీ శ్రీధర్‌రాజు, పార్టీ నాయకులు సూరిశెట్టి కన్నారావు, టెక్కలి కొండలరావు,పెంటకోట వెంకట్ తదితరులు మురళీకృష్ణకు నివాళులర్పించారు.

## సొంతింటి కల నెరవేర్చుకోండి

కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ కోరారు. టి.జగ్గంపేటలోని వైఎస్సార్ జగనన్న కాలనీ లే అవుట్‌లో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రత్యేకాధికారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నిరుపేదకు సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో కాలనీలు నిర్మించి ఇస్తోందన్నారు. బిల్లులు సకాలంలో మంజూరవుతున్నాయని, మెటీరియల్ కూడా అందుబాటులో ఉందన్నారు. ఇంకా నిర్మాణాలు ప్రారంభించని వారు వెంటనే మొదలెట్టాలని కోరారు. ఎంపీడీవో చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, సర్పంచ్ రమణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వెంకన్న ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో భక్తుల సందడి

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండల కేంద్రంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని ప్రత్యేక అలంకరణ చేసి, ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు స్వామి వారికి పాలాభిషేకం చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు ప్రభాకర్ శర్మ పాల్గొన్నారు.

# స్త్రీనిధి లోన్ అక్రమాలపై నిగ్గు తేల్చండి

- లైనుకొత్తూరులో ప్రభుత్వ భూమి కబ్జా
- అధికారుల పర్యవేక్షణ ఏదీ
- మండల సమావేశంలో సభ్యుల ఆగ్రహం



డ్వాక్రాలో స్త్రీనిధి లోన్‌లో అక్రమాలపై వెలుగు అధికారిని నిలదీస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ

యలమంచిలి : గత సమావేశంలో స్త్రీ నిధిలోన్‌లో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాలని సభ్యులు అడిగిన ప్రశ్నలకు సంబంధిత అధికారులు ఎంత వరకు రికవరీ చేశారు...ఆ సొమ్ము ఎక్కడికి వెళ్లింది అని ఎంపీపీ గోవింద్ అధికారులను ప్రశ్నించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గోవింద్ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఎంపీడీవో ప్రసాదరావు గత సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలపై ఎంత వరకు పరిష్కారం అయ్యాయో చర్చించారు. వైస్ ఎంపీపీ రాజాన శేషు మాట్లాడుతూ మండలంలో ప్రతి గ్రామంలో ఎన్ని స్త్రీ నిధి లోన్‌లు మంజూరు చేశారు.. ఎంత మంది సభ్యులు స్త్రీనిధి నగదు చెల్లిస్తున్నారు..వారి బ్యాంక్ స్టేట్‌మెంట్‌తో కూడిన పూర్తి నివేదికలు తయారు చేసి తమకు అందజేయాలన్నారు. జాతీయ రహదారికి అనుకుని బయ్యవరం పంచాయతీలో వ్యవసాయ భూమిలో ఎటువంటి అనుమతులు లేకుండా వైశాఖి బయో మెరైన్ రొయ్యలు మత్స్య ప్రోసెసింగ్ పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నారని, వ్యవసాయాధార భూముల్లో వ్యర్థ పూరితమైన పరిశ్రమకు ఎలా అనుమతులు మంజూరు చేశారని ప్రశ్నించారు. లైనుకొత్తూరు గ్రామంలో 99,97 సర్వే నంబర్లలో ప్రభుత్వ భూమిని విశాఖపట్నంకు చెందిన ఒక బడా వ్యక్తి ఆక్రమించుకొన్నాడని వారిపై రెవెన్యూ అధికారులకు స్థానిక సర్పంచ్‌లు ఎన్నిసార్లు చెప్పినా పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మండల పరిషత్ సమావేశానికి రెవెన్యూ అధికారులు, విద్యాశాఖ అధికారులు రాకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రుక్మిణీపురం సర్పంచ్ కరణం సత్తిబాబు మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ అధికారులు సరైన మందులు సరఫరా చేయక తమ గ్రామంలో పశువులు మరణించాయని కాలం చెల్లిన మందులతో పశువులకు ఏవిధంగా వైద్యం చేస్తారని సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి, వైస్ ఎంపీపీ శిల్పరశెట్టి ఉమ పాల్గొన్నారు.

## చెవులపిల్లి భలే...చెట్టు నీడ భలే



ఆలయ ప్రాంగణంలో చెట్ల కింద సేద తీరుతున్న కుందేళ్లు

అచ్యుతాపురం (అనకాపల్లి) : వేసవి తాపానికి జనం అవకాశం ఉన్న చల్లని ప్రాంతాన్ని ఎన్నుకుంటున్నారు. జంతువులు మాత్రం చెట్ల కిందే సేద తీరుతున్నాయి. అచ్యుతాపురం మండలంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని చెట్ల కింద కుందేళ్లు సేద తీరుతున్న దృశ్యం చూపరులను ఆకర్షించింది.

# దిశ ఫౌండేషన్ చొరవతో మళ్లీ అత్తింటికి



పోలీసుస్టేషన్‌లో తన ఇద్దరు పిల్లలతో బాధితురాలు దారాలమ్మ

కోటవురట్ల : దిశ ఫౌండేషన్ ఓ బాధితురాలికి అండగా నిలిచింది. అత్తింటి వారి ఆగడాలతో వేధింపబడిన మహిళకు మేమున్నామంటూ మనోధైర్యాన్ని కల్పించింది. పోలీసులు, దిశ ఫౌండేషన్ చొరవతో బాధిత మహిళకు న్యాయం జరిగింది. వివరాల్లోకి వెళితే కాదలూరి దారాలమ్మ, కాదలూరి లోవరాజు పన్నెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొన్నాళ్లకు లోవరాజుకు భార్య దారాలమ్మపై మోజు తీరిపోయి ఎలాగైనా ఆమెను వదిలించుకోవాలనుకున్నాడు. గత ఏడాది అక్టోబర్‌లో విశాఖలో ఓ అద్దింటిలో భార్యా పిల్లలను ఉంచి ముఖం చాటేశాడు. గత్యంతరం లేక దారాలమ్మ అత్తా మామల ఊరైన అన్నవరం వచ్చి న్యాయం చేయాలని పోరాటం చేసింది. ఆ సమయంలో దిశ ఫౌండేషన్ రాష్ట్ర సెక్రటరీ కొణతాల వరలక్ష్మి కల్పించుకుని అత్తింటి వారిని ఒప్పించి ఇంట్లో ఆశ్రయం కల్పించారు. దారాలమ్మ బాణసంచా కేంద్రంలో పని చేసుకుంటూ పిల్లలను పోషిస్తోంది. ఇదిలా ఉండగా తాజాగా నాలుగు రోజులుగా అత్త సీతమ్మ తనను, ఇద్దరు పిల్లలను ఇంట్లో నుంచి బయటకు వెళ్లగొట్టి వేధిస్తోందని దిశ ఫౌండేషన్‌ను మరోసారి ఆశ్రయించింది. దిశ ఫౌండేషన్ సభ్యులు బాధితురాలు దారాలమ్మ తరఫున పోలీసు స్టేషన్‌కు శనివారం వెళ్లి న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ నారాయణరావు అత్త సీతమ్మను స్టేషన్‌కు పిలిపించి ఇద్దరికీ కౌన్సెలింగ్ చేశారు. మానవతా దృక్పథంతో చూడాలని ఇంట్లోకి రానివ్వాలని సూచించారు. మళ్లీ వేధిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అత్త ఒప్పుకోవడంతో కథ సుఖాంతమైంది. దిశ ఫౌండేషన్ రాష్ట్ర సెక్రటరీ కొణతాల వరలక్ష్మి, సభ్యులు పల్లా సత్యవతి, ఇతంశెట్టి హేమలత, చిటికెల రమణమ్మ కలిసి దారాలమ్మను అన్నవరంలోని అత్తింటికి తీసుకెళ్లి ఇంట్లోకి పంపించారు. ధైర్యంగా ఉండాలని, మళ్లీ ఏదైనా సమస్య వస్తే మేమున్నామంటూ భరోసా ఇచ్చారు.

## విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



తాము గీసిన చిత్రాలను చూపిస్తున్న విద్యార్థులు

రాంబిల్లి : దిమిలి శాఖా గ్రంథాలయంలో శనివారం వేసవి శిక్షణలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనంపై లైబ్రేరియన్ శకుంతల అవగాహన కల్పించారు. అనంతరం చిత్ర లేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. రిసోర్స్ పర్సన్ జి.నూకినాయుడు నీతికథలు చెప్పారు. కథల్లో నీతిని విద్యార్థులు గ్రహించి సమాజంలో మంచి వ్యక్తులుగా ఎదగాలన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

అనకాపల్లిటౌన్: మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలంటే నిత్యం యోగా చేయాలని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు, వైద్యుడు గండి వెంకట సత్యనారాయణ అన్నారు. స్థానిక భారత స్వాభిమాన్ ట్రస్ట్, పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ క్రీడా మైదానం నుంచి నెహ్రూ చౌక్ వరకూ జార్జి క్లబ్ యోగ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 28న జార్జి క్లబ్ ఆవరణలో ఉదయం 6 గంటలకు యోగాసనాల పోటీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గెలిపొందిన వారికి సాయంత్రం 6 గంటలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భారత స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు భీశెట్టి దొరమనాయుడు, యోగ సభ్యులు పాల్గొన్నారు.

## బీజేపీ మండల అధ్యక్షుడిగా కారె రాముడు



నియామక పత్రం అందుకుంటున్న కారె రాముడు

రాంబిల్లి: బీజేపీ రాంబిల్లి మండల అధ్యక్షుడుగా కారె రాముడును నియమించారు. వాడనర్సాపురం గ్రామానికి చెందిన రాముడుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధవ్‌లు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాముడు మాట్లాడుతూ, ప్రధాని మోదీ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

## కెనరా బ్యాంకు బ్రాంచి ఏర్పాటుకు వినతి

మాడుగుల రూరల్: మండలంలో వీరనారాయణంలో కెనరా బ్యాంకు బ్రాంచిని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు విశాఖలో కెనరా బ్యాంకు ప్రాంతీయ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. పలు సంక్షేమ పథకాలకు సంబంధించి నగదు ప్రజలు ఖాతాల్లో వేస్తున్నారని, వీరనారాయణం గ్రామాన్ని మాడుగుల గ్రామీణ వికాస్ బ్యాంకు దత్తత తీసుకుందని, పూర్తిస్థాయిలో సేవలు అందించలేదని, ఈ దృష్ట్యా కెనరా బ్యాంకు బ్రాంచిని ఏర్పాటు చేయాలని కోరారు. జి.అగ్రహారం, చింతలూరు, గదబూరు, జంపెన, గాదిరాయి, సత్యవరం, ఎం. కృష్ణాపురం గ్రామాలకు ప్రయోజనం కలుగుతుందని కాళ్ల బాలకృష్ణ, తదితరులు తెలిపారు.

## రూ.7.50 లక్షలతో గిరిజనులకు రోడ్డు సౌకర్యం

రోలుగుంట: గిరిజన గ్రామాల రహదారి సమస్యలపై ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ దృష్టి సారించారని ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన తన చాంబర్‌లో మాట్లాడుతూ గత నెల లోసింగిలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ అర్ల గిరిజన పంచాయతీ శివారు పాత లోసింగి, కొత్త లోసింగి, పీత్రుగెడ్డ తదితర గ్రామాల గిరిజనులకు రహదారితోపాటు పలు సమస్యలు తెలుసుకున్నారన్నారు. వీటి పరిష్కార చర్యల్లో భాగంగా ఆ గ్రామాలకు రహదారి ఏర్పాటు చేయాలని ఆదేశించారన్నారు. అందుకోసం మండల పరిషత్ నిధుల నుంచి రూ.7.50 లక్షలు మంజూరు చేసి, శంకుస్థాపన చేశామన్నారు. ఈ పనులు పూర్తయితే రోలుగుంట మండలంలో మైదాన ప్రాంతానికే కాకుండా రావికమతం మండలం చలిసింగం, వయా జెడ్.కొత్తపట్నం మీదుగా రావికమతం, కొత్తకోట మైదానంలో ప్రధాన గ్రామాలకు వెళ్లే రహదారి సమస్య మెరుగుపడుతుందన్నారు. మైదాన ప్రాంతంలో బీఎన్ రోడ్డు విస్తరణ పనులు వెలంకాయలపాలెం నుంచి వడ్డాది కూడలి వరకు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు.

# వాడ్రాపల్లిలో తోడపెద్దుల ఊరేగింపు



వాడ్రాపల్లిలో తోడపెద్దు పాలుకొలుపులో భాగంగా సేవగరిడి



సింహాద్రప్పన్నను దర్శించుకుంటున్న గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్



ఆకట్టుకున్న మహిళల సేవగరిడి

మునగపాక : మండలంలోని వాడ్రాపల్లిలో శనివారం తోడపెద్దు పాలుకొలుపు కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రెండు రోజుల పాటు గ్రామంలో సేవగరిడీలతో పండగ వాతావరణం నెలకొంది. 12 ప్రాంతాల నుంచి సేవగరిడీలతో వచ్చిన తోడపెద్దులను గ్రామంలో ఊరేగించారు. గ్రామస్తులంతా తోడపెద్దులను సింహాద్రప్పన్నగా భావించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని అన్ని వీధుల గుండా ఊరేగింపు చేపట్టారు. తోడ పెద్దు సేవలను తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు అన్న సమారాధన జరిపారు. ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ కొణతాల జగన్ తదితరులు పూజల్లో పాల్గొన్నారు. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, కొయిలాడ దశావతారం, రామజోగినాయుడు, కొణతాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# చెరువుల అభివృద్ధికి ప్రాధాన్యం



సీలప్పన్న చెరువు సుందరీకరణ పనుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక : మునగపాక సీలప్పన్న చెరువు సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు(కన్నబాబు) కోరారు. శనివారం మునగపాక వచ్చిన ఆయన చెరువు పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. చెరువులను అభివృద్ధి చేసి, చుట్టూ వాకింగ్ పార్క్ ఏర్పాటు చేయాలని సూచనలు చేశారు. చెరువును ఆనుకొని ఉన్న పాకలను తొలగించి వారికి పట్టాలు అందజేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు రామ్మోహనరావు, సర్పంచ్ దిమ్మల అప్పారావు పాల్గొన్నారు.

# రేపు భారీ బైకు ర్యాలీ

ఎస్.రాయవరం: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోనికి వచ్చి దిగ్విజయంగా నాలుగేళ్లు పూర్తి చేసుకుని అయిదో ఏట అడుగు పెడుతున్న శుభ తరుణంలో నియోజకవర్గంలో భారీ బైకు ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. కొరుప్రోలు క్యాంపు కార్యాలయంలో శనివారం నాలుగు మండలాల ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. మే 30తో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసి నాలుగేళ్లు పూర్తయ్యి అయిదో ఏడాది ప్రారంభ అవుతోందన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో 29వ తేదీ సోమ వారం మధ్యాహ్నం 3 గంటలకు పాయకరావుపేట పాండురంగస్వామి గుడి వద్ద నుంచి అడ్డురోడ్డు వరకు సుమారు 2 వేల బైకులతో ర్యాలీ నిర్వహిస్తునట్టు చెప్పారు. ఈ ర్యాలీకి మండలానికి 5 వందలు చొప్పున బైకులు ఉన్న కార్యకర్తలు తరలిరావాలన్నా రు. అలాగే 30వ తేదీ మధ్యాహ్నం అడ్డురోడ్డు కూడలిలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎస్.రాయవరం, పాయకరావుపేట జెడ్పీటీసీలు కాకర దేవి, లంక సూరిబాబు, ఎస్.రాయవరం ఎంపీపీ కోన లోవలక్ష్మి, పాయకరావుపేట, ఎస్.రాయవరం మండలాల వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులు ధనిశెట్టి బాబూరావు, కొణతాల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి దత్తుడు సీతబాబు, పార్టీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీపతిరాజు, పోలిశెట్టి పెద ఈశ్వరరావు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇళ్ల మంజూరుకు చర్యలు



లోవపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

రాంబిల్లి : పార్టీలకతీతంగా కేవలం అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత జననేత జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే యువీ రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. జడ్. చింతువా సచివాలయం పరిధిలో గల నేవీ పునరావాసకాలనీలో శనివారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ద్వారా ఎంత మేర లబ్ధి చేకూరింది వివరించారు. ఇంకా ఎవరైనా అర్హత వుండి సంక్షేమ పథకాలు అందకపోతే చెప్పాలని కోరారు. పలువురు ఇళ్లు మంజూరు చేయాలని కోరగా ఇళ్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. నేవీ పునరావాసకాలనీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలకు ఎటువంటి లాబీయింగ్ , అక్రమాలకు చోటు లేకుండా పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామన్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. ప్రతిపక్ష పార్టీలు గెలిస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయన్నారు. వలంటీర్లకు ఎమ్మెల్యే సొంత నిధులతో సమకూర్చిన వాటర్ ప్రూఫ్ బ్యాగులను అందజేశారు.

# సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలి



పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు అందిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

రాంబిల్లి : సేంద్రియ ఎరువులపై రైతులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. నేవీ పునరావాసకాలనీలో శనివారం ఆయన రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను అందజేశారు. ప్రభుత్వం రాయితీపై జనుము, జీలుగ, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట విత్తనాలను రాయితీపై అందజేస్తుందన్నారు. పచ్చిరొట్ట ఎరువుల వినియోగంతో ఖర్చు తగ్గుతుందని, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు లభ్యమవుతాయని అన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ నాగరాజు, ఏవో సుమంత పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం

కశింకోట: గవరపేట రామాలయం వద్ద శనివారం వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 30 మందికి అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రి నుంచి వచ్చిన ఆప్తాల్మిక్ సంధ్య కంటి రోగులను పరీక్షించి 15 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించారు.